

నడుస్తూ.. నడిపిస్తూ..

ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక, శారీరక ఉల్లాసానికి నడకే సరైన మార్గమని శాస్త్రీయంగా నిరూపితమవుతోంది. వాకింగ్‌పై ఇటీవల ఆసక్తి పెరిగింది.

-8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,410
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,306
3 శాతం జీఎస్టీతో	రూ.5,465
సవర (8 గ్రా)	రూ.43,270

గరిష్టం/కనిష్టం
31.5 /23.2

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ 62 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

టీడీపీలో విగ్రహావిష్కరణ చిచ్చు

- తెలుగు తమ్ముళ్ల తోపులాట
- గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- సాయిపేటలో పోలీసుల పికెట్

కొండాపురం: మండలంలోని సాయిపేటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ విషయమై టీడీపీలోని రెండు వర్గాల నాయకులు బుధవారం ఘర్షణకు తెగబడ్డారు. సాయిపేటకు చెందిన గూడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహన్‌రావు, అదే పంచాయతీ ఎర్రబాలెంకు చెందిన కొమ్మి ప్రభాకర్ కలిసి సాయిపేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో ఆవిష్కరించాలని భావించారు. అప్పుడు వీలు పడకపోవడంతో గతేడాది డిసెంబరు 8న చంద్రబాబుతో ఆవిష్కరించాలని ఏర్పాట్లు చేశారు. అదీ కూడా వాయిదా పడింది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు మూడు రోజుల క్రితం తన అనుకూల వర్గాన్ని పిలిపించుకుని ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు విగ్రహ ఆవిష్కరణ చేయాలని ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఇది తెలుసుకున్న కొమ్మి ప్రభాకర్ తాను కూడా విగ్రహ ఏర్పాటుకు ఆర్థికంగా సహకరించానని, తనకు తెలియకుండా విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారంటూ బొల్లినేని వ్యతిరేకంగా ఉండే దామా మహేష్ తదితరులను కలిశారు. దీంతో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకే విగ్రహ ఆవిష్కరణ చేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మహేష్, ప్రభాకర్ తాము సాయిపేట వెళుతున్నామని అక్కడ గొడవ జరిగే అవకాశం ఉందని, కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలికి చెప్పారు. దీంతో ఎస్సై తన సిబ్బందితో సాయిపేట చేరుకున్నారు. అప్పటికే మాజీ ఎమ్మెల్యే అనుచరుడు కుంకు మోహన్‌రావు తన వర్గంతో అక్కడ మోహరించి ఉన్నాడు. ప్రభాకర్, దామా మహేష్ అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు సర్దుబాటు చేసి చెదరగొట్టారు. ఎస్సై ఖాజావలి ఈ విషయాన్ని కావలి డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. డీఎస్పీ విగ్రహ ఆవిష్కరణకు ఎవరికి అనుమతి ఇస్తే వారు చేసుకోవాలని సూచించారు. మళ్లీ సాయంత్రం 4 గంటలకు కొమ్మి ప్రభాకర్, మహేష్ వర్గం ఎన్టీఆర్ విగ్రహం వద్దకు రావడంతో వివాదం రేగింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను తరిమి వేశారు. పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

చరితార్థం

నెల్లూరు బ్యారేజ్‌కు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు



నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరు పెట్టిన నెల్లూరు బ్యారేజీ



నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

జిల్లా రాజకీయాల్లో మకుటం లేని మహారాజు దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి. రాష్ట్ర స్థాయిలో రాజకీయాలను శాసించిన ధీరశాలి ఆయన. తన రాజకీయ వ్యూహంతో కేంద్రంలో కాంగ్రెస్ హైకమాండ్‌కే ముచ్చెమటలు పట్టించిన ఘనాపాటి. జిల్లా రైతాంగం కోసం ఆయన చేసిన కృషికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి కిరీటం ధరింప చేశారు. నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును చరితార్థం చేశారు.

- ఆమోదించిన రాష్ట్ర కేబినెట్
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం: జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాల్లో నల్లపరెడ్డి కుటుంబం ఒకటి. ఇప్పటికీ ఆ కుటుంబానికి విధేయులుగా నడుచుకునే అభిమానులు, రాజకీయ నాయకులు ఉన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరు వింటేనే రాష్ట్రంలో ఎవరికైనా తక్కున గుర్తుకు వచ్చేది నెల్లూరు. రైతుల కష్టాలు ఎరిగిన శ్రీనివాసులురెడ్డి వారికి అండగా నిలిచారు. తెలుగు గంగ ప్రాజెక్ట్‌ను జిల్లాకు తీసుకురావడంతో పాటు, దానిని ఎన్టీఆర్, ఎంజీఆర్‌లతో కలిసి రైతాంగానికి అంకితమిచ్చారు. సోమశిల నీటి సామర్థ్యాన్ని పెంపొందించే విషయంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు చిరస్మరణీయం. జిల్లాలో ఎక్కువగా డెల్టా ప్రాంతంలోని రైతులకు సాగునీటి కష్టాలు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని రెండు పంటల సాగుకు నీరందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

రైతుల గుండెల్లో అజరామరం

నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిని జిల్లాలోని ప్రతి రైతు తమ గుండెల్లో నింపుకున్నారు. రైతులు పడుతున్న సాగు నీటి కష్టాలను గుర్తించిన నల్లపరెడ్డి ప్రాజెక్ట్‌ల సాధన కోసం నిత్యం పోరాటాలు చేసి రైతుల పాలిట పోరాట యోధుడిగా పేరు తెచ్చుకున్నారు. జిల్లాలో తనకంటూ ప్రత్యేక రాజకీయ ముద్రను వేసుకున్న నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి రైతు బాంధువుడిగా నిలిచిచారు. ప్రస్తుత పెన్నాడెల్టా ఆధునికీకరణకు 1987లో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రతిపాదనలు పంపారు. ఆయన భౌతికంగా లేకపోయినా.. రైతులు గుండెల్లో అజరామరుడిగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నిలిచిపోయారు.

నల్లపరెడ్డి పేరు శాశ్వతం

గతేడాది అక్టోబరు 27వ తేదీ నెల్లూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు నామకరణం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కేబినెట్ నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరును పెడుతూ తీర్మానాన్ని ఆమోదించింది. జిల్లా రైతుల కోసం కష్టపడిన దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీ ఉన్నంత వరకు.. చరిత్ర చెరిగిపోని వరకు బతికే ఉంటారు. నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టడంపై పలువురు రాజకీయ విశ్లేషకులు, నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీనివాసులురెడ్డి రాజకీయ ప్రయాణం

ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట మండలంలోని కొత్తపట్నం గ్రామానికి చెందిన నల్లపరెడ్డి వీరరాఘవరెడ్డి కుమారుడు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి. 1933 ఏప్రిల్ 30న జన్మించారు. విశాఖపట్నంలో బీఎల్ పూర్తిచేసే సమయంలో రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. 1961వ సంవత్సరంలో కోట సమితి అధ్యక్షుడిగా తొలిసారి రాజకీయ ఆరంగేట్రం చేశారు. 1972లో జనరల్ స్థానంగా ఉన్న గూడూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1978లో వెంకటగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. ఆ తర్వాత నుంచి కోవూరు నియోజకవర్గాన్ని తన స్థానంగా శాశ్వతం చేసుకున్నారు. కోవూరు నియోజకవర్గం నుంచి 1983, 1985లో టీడీపీ తరఫున, 1989లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ విధంగా జిల్లా అంతటా నల్లపరెడ్డి వర్గాన్ని సృష్టించుకున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముఖ్యమంత్రులు టి.అంజయ్య, మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు కేబినెట్‌లో మంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రజలు మన్ననలు అందుకున్నారు. రాజీ పడని రాజకీయ నేతగా.. ఎమ్మెల్యేగా ఒక్క రోజు కూడా గైర్హాజరు కాకుండా అసెంబ్లీ టైగర్‌గా పేరు తెచ్చుకున్నాడు.



తెలుగు గంగ కాలువ ప్రారంభంలో ఎన్టీఆర్, ఎమ్‌జీఆర్‌తో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిది



నెల్లూరు బ్యారేజీకి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెడుతూ కేబినెట్‌తో ఆమోదింపచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవిత కాలం రుణపడి ఉంటాం. మా తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు, రైతులకు చేసిన సేవలకు ఇన్నాళ్లకు గుర్తింపు లభించింది. మా తండ్రి భౌతికంగా లేకపోయినా.. బ్యారేజీ పేరుతో రైతుల గుండెల్లో గుర్తిండిపోతారు. ఇది జీవితంలో మరచిపోలేని రోజు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

నమ్మకాన్ని నిలబెట్టుకోలేదు

- ఆనంపై నేదురుమల్లి పరోక్ష విమర్శలు



మా నమ్మకం నువ్వే జగన్ కిట్‌లను పంపిణీ చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ప్రజలు గెలిపించిన నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకోలేక పోయారని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిపై తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం కలువాయి మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లతో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనపై సంపూర్ణ సంతృప్తి, విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే ఆనం మాత్రం పదేపదే ప్రభుత్వంపై విమర్శలు చేశారన్నారు. అందుకే ఇక చాలు నీ సేవలని చెప్పి నియోజకవర్గ బాధ్యతలు తనకు అప్పగించారన్నారు. ప్రతి ఒక్కరం కష్టపడుతూ 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. నాయకులు, వలంటీర్లు, కన్వీనర్లు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రధానంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందే విధంగా చూడాలన్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో మీరే జగనన్న సైన్యం అన్నారు. మీ ద్వారానే నియోజకవర్గంలోని అన్ని సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. జగనన్న సైన్యంగా మీరందరూ ముందు ఉంటే మీ వెనుక మేముంటామన్నారు. అందరం కలిసి పని చేద్దామన్నారు. ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగన్' అనే ప్రత్యేక కిట్‌ను ప్రతి ఒక్కరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సర్వేపల్లి నుంచే పోటీ చేస్తా

- సోమిరెడ్డినే ప్రత్యర్థిగా కోరుకుంటా
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రెండు దఫాలు ఓట్లు వేసి తనను గెలిపించిన సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలంటే నాకు ప్రాణం. ప్రజల రుణం తీర్చుకునేలా శక్తివంచనా లేకుండా పనిచేస్తున్నాను. నాలుగు దఫాలు ఓటమిపాలైన సోమిరెడ్డి నాకు అసలు పోటీనే కాదు. రాజకీయాల్లో ఉన్నంత వరకు సర్వేపల్లి నుంచే పోటీ చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం రాత్రి మండలంలోని రామదాసుకండ్రిగలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లిలో పోటీ విషయమై తనపై సోమిరెడ్డి చేసిన వ్యాఖ్యలు నవ్వు తెప్పిస్తున్నాయన్నారు. నాకు సర్వేలు చేయించుకునే అలవాటు లేదని, తెలుగుదేశం పార్టీతో పాటుగా, అనేక సంస్థలు చేపట్టిన సర్వేల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో 14.5 శాతం ఓట్ల ఆధిక్యంతో వైఎస్సార్‌సీపీ ముందంజలో ఉందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలవనున్న నాపై టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి పోటీ చేస్తే 19 శాతం ఓట్ల మెజారిటీతో నా గెలుపు ఖాయమని సర్వేలు నిర్వహించిన అనేక సంస్థలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సోమిరెడ్డికి మతిస్థిమితం లేదు

వరుసగా నాలుగు సార్లు ఓటమి పాలైన సోమిరెడ్డి కొన్ని నెలలుగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని మంత్రి కాకాణి విమర్శించారు. చిత్తుచిత్తుగా ఓటమిపాలవుతున్న సోమిరెడ్డిని మా నియోజకవర్గం నుంచి పోటీకి టికెట్ ఇవ్వద్దని సర్వేపల్లి టీడీపీ నాయకులు చంద్రబాబుకు మొరపెట్టుకుంటున్నారన్నారు. దీంతో సోమిరెడ్డికి మతిభ్రమించిందని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణతో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మళ్లీ సోమిరెడ్డినే బలిపశువును చేయబోతున్నారని హేళన చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు మూడో సారి నన్ను వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించి చరిత్రను తిరగరాసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 450 మెగావాట్లు, 2వ యూనిట్లో 415 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. 3వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశామని వెల్లడించారు.





ఇక సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

- సర్వే నంబరు స్థానంలో ఎల్‌పీఎం
- యూనిక్ ఐడీతో ప్రత్యేక భూహక్కు కార్డు
- ఇప్పటికే 118 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- త్వరలో 106 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చిన సబ్‌రిజిస్ట్రార్‌లు

నెల్లూరు(సెంట్రల్): భూ సమస్యలకు చెక్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన భూ రీసర్వే సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో ప్రారంభమైన రీ సర్వే ఇప్పటికే ఊపందుకుంది. రైతులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు రీసర్వేతో చెక్ పెట్టనున్నారు. ప్రధానంగా గతంలో బ్రిటిష్ వారు కేటాయించిన సర్వే నంబరు స్థానంలో కొత్తగా ఎల్‌పీఎంను తీసుకొస్తున్నారు. రిజిస్ట్రేషన్స్ చేసుకునే సమయంలో ఎక్కడా ఇబ్బందులు, చిక్కులు లేకుండా పక్కాగా రీ సర్వే చేస్తున్నారు.



భూ సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు (ఫైల్ ఫొటో)

సర్వే నంబరు స్థానంలో ఎల్‌పీఎం

బ్రిటిష్ వారి హయాంలో భూమికి సంబంధించి సర్వే నంబర్లను కేటాయించారు. అదే ప్రస్తుతం కొనసాగుతూ వస్తోంది. కాని భూ రీసర్వేలో సర్వే నంబరు అనే పేరు లేకుండా ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) అనే నంబరును కేటాయిస్తున్నారు. దీంతో పాటు ప్రత్యేక యూనిక్ ఐడీతో భూ హక్కు కార్డును ఇస్తున్నారు. ఈ కార్డు ఉంటే పూర్తిగా భూమికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నట్లుగా హక్కు కల్పిస్తున్నారు.

118 గ్రామాల్లో పూర్తి...

జిల్లాలో మొదటగా మూడు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా భూ రీసర్వే చేశారు. అది విజయవంతం కావడంతో రెండో విడతలో 103 గ్రామాల్లో భూ రీసర్వే చేశారు. ప్రస్తుతం మూడో విడత రీ సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 118 గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీ సర్వే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రీసర్వే పూర్తయిన చోట భూహక్కు కార్డులు జారీ చేసే ప్రక్రియలో అధికారులు నిమగ్న

106 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

జిల్లాలో ప్రస్తుతం మొదటి విడతగా 106 వార్డు/గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేసే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి కావడంతో భూ హక్కు కార్డులు మంజూరు చేస్తున్నారు. వీటి పంపిణీ పూర్తికాగానే రిజిస్ట్రేషన్స్ శాఖకు కూడా సర్వే నంబరు ప్రాంతంలో ఎల్‌పీఎం నంబరును కేటాయిస్తూ ఆదేశాలు ఇస్తారని, అప్పటి నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ

రిజిస్ట్రేషన్స్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని ఎంపిక చేసిన 106 ప్రాంతాల్లోని సచివాలయ పంచాయతీ సెక్రటరీలకు, ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ఉండే విధంగా పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే పంచాయతీ సెక్రటరీలు రిజిస్ట్రేషన్స్ చేసే ముందు ఆయా పరిధిలోని మండల సబ్‌రిజిస్ట్రార్ వద్ద ఎల్‌పీఎం నంబరుకు సంబంధించి అనుమతి తీసుకుని రిజిస్ట్రేషన్స్ చేయాల్సి ఉంటుంది.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



జిల్లాలో ప్రస్తుతం కొన్ని పంచాయతీల్లో భూ రీసర్వే పూర్తయిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. పూర్తి చేసిన ప్రాంతాల్లో ఈ నెల చివరికి లేదా మార్చి నెలలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్స్ ప్రక్రియను ప్రారంభిస్తాం. ఇప్పటికే స్థానికంగా ఉన్న పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కూడా ఇచ్చాం.

–కిరణ్‌కుమార్, డీఐజీ రిజిస్ట్రేషన్స్

టమయ్యారు.

కోటంరెడ్డి జీవితాంతం ధర్నాలు చేసుకోవాల్సిందే

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త, ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన జీవితాంతం ధర్నాలు చేసుకుంటూనే బతకాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి రూరల్ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో తాను రూరల్‌లోని అన్ని గ్రామాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గతంలో కూడా తాను రూరల్ గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశానన్నారు. రూరల్‌లోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు తనపై గౌరవం, నమ్మకంతో సమావేశానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలు ఇక ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిధులు కొరత లేకుండా చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడం తన లక్ష్యమన్నారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని తెలిపారు.



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు

కోటంరెడ్డి సోదరుల అరాచక పాలన

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోటంరెడ్డి సోదరుల అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు రూరల్ ప్రాంతంలో నియంత పాలన కొనసాగిందని, ఇక వారి ఆటలు సాగనివ్వబోమన్నారు. గ్రామాల్లో కోటంరెడ్డి సోదరులు భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. రూరల్ గ్రామాల అభివృద్ధికి రూ.75.80 లక్షలతో గతంలో జెడ్పీ నిధులు మంజూరు చేస్తే ఆ పనులు జరుగకుండా కాంట్రాక్టర్లను అధికారులను బెదిరించి నిలిపివేశారని, మళ్లీ రూ.కోటి జెడ్పీ నిధులు మంజూరు చేయాలని భావిస్తే దానిని కూడా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అడ్డుకున్నారని చెప్పారు. అలాంటిది ప్రస్తుతం సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేస్తానని ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను బానిసలుగా చూశారని తన కార్యాలయానికి కానీ, ఎంపీ ఆదాల కార్యాలయానికి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల సమస్యల పరిష్కారానికి వస్తే వారిపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించారన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సమైక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

నడుస్తూ.. నడిపిస్తూ..

కుదిరితే పరిగెత్తు.. లేకపోతే నడువు.. అదీ చేతకాకపోతే పాకుతూపో.. అంతేకానీ ఒకేచోట అలా కదలకుండా ఉండిపోకు.. అని శ్రీశ్రీ చెప్పిన మాటలు మన ఆరోగ్యానికి కూడా వర్తిస్తాయి. క్రమం తప్పకుండా నడకను కొనసాగించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చనే విషయం ప్రస్తుతం అందరికీ అర్థమవుతోంది. నగరంలో అంతకంతకూ పెరుగుతున్న వాకర్సే ఇందుకు నిదర్శనం.

- రోజురోజుకూ పెరుగుతున్న వాకర్స్
- ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన
- ఫిట్‌నెస్‌తోపాటు సౌందర్యం


ఏసీ స్టేడియంలో వాకర్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆరోగ్యంలో కింగ్స్‌గా ఉండేవాళ్లు వాకర్సే. హడావుడి జీవితంలో క్రమం తప్పకుండా వాకింగ్ చేసే వారి జోలికి ఏ అనారోగ్య సమస్యలు దరిచేరవని శాస్త్రీయంగా నిరూపితమవుతోంది. కరోనా తరువాత కొత్త కొత్త జబ్బులతో బాధపడుతున్న వారు సైతం నడకను ఆశ్రయిస్తున్నారు. మైదానాలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్లు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో నిండిపోతున్నాయి. జంక్ ఫుడ్‌తో వచ్చే స్థూలకాయం సమస్యల నుంచి ఏ విధమైన ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలని వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీ, పురుషులిరువురూ నడకను నిత్యజీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వారి మధ్య కొత్త స్నేహాలు ఏర్పడడంతోపాటు ఆ స్నేహం బలపడి మానసిక ప్రశాంతత పొందడం ద్వారా అదనపు ప్రయోజనం కలుగుతోంది. నెల్లూరులో ఉదయం, సాయంత్రం సమయాల్లో బీవీఎస్, ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్స్, సెయింట్ పీటర్స్ హైస్కూల్, వీఆర్సీ హైస్కూల్, దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్, పోలీసు పరేడ్ గ్రౌండ్, నెల్లూరు స్వర్ణాలచెరువు నెక్లెస్ రోడ్డు, ఇంచుమించు 30 పార్కులతోపాటు ప్రధానంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ కోలాహలం కనబడుతోంది. ఇక రోడ్లు, ఖాళీ ప్రదేశాలు, నగర శివారు ప్రాంతాల్లో సైతం నిత్యం వాకర్స్ వాకింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతాలన్నింటిలో కలిపి ఉదయం పూట సుమారు 32 వేల మంది, సాయంత్రం వేళ 27 వేల మంది వాకింగ్ చేస్తున్నారని అంచనా. వాకింగ్‌కు సంబంధించి కొంతమంది వాకర్స్ వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా..

ఆహారపు అలవాట్లు ముఖ్యం



వాకర్స్‌కు ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యం. పురుషులు, మహిళలు తమ వయోపరిమితిని అనుసరించి ఆహారం తీసుకోవాలి. ఉదాహరణకు 60 కిలోలు ఉన్న పురుషులకు సాధారణంగా ఒక రోజుకు 2 వేల కేలరీల నుంచి 3 వేల కేలరీలు, బరువుకు తగ్గట్లు ఒక కిలోకు ఒక గ్రాము ప్రొటీన్ ఫుడ్ అవసరమవుతుంది. చేసే పనిని అనుసరించి ఈ ఆహారం తీసుకోవాలి. అలాగే మహిళలకు వ్యత్యాసం ఉంటుంది. గర్భిణులు 10 నుంచి 20 శాతం ఆహారం అధికంగా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా వాకర్స్ శరీరతత్వాన్ని అనుసరించి వారికి సరిపడా ఆహారం పరిమాణం మారుతుంది. వైద్యులను సంప్రదించి ఆహారపు అలవాట్లను నిర్ధారణ చేసుకోవడం మంచిది.

– ఎ.బాలమ్మ, న్యూట్రిషన్ కౌన్సిలర్, జీజీహెచ్, నెల్లూరు.

వాకింగ్ ఉద్యమం



వాకింగ్ ఇప్పుడు ఉద్యమంలా నడుస్తోంది. గతంలో మైదానాల్లో స్పోర్ట్స్, గేమ్స్ మాత్రమే కనబడుతుండేవి. అయితే ఇప్పుడు ఆ క్రీడాకారుల స్థాయికి మించి వాకర్స్ ఉదయం, సాయంత్రం కనిపిస్తున్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ఫిట్‌నెస్, మానసిక ప్రశాంతత పొందుతున్నారు.

– ఆర్కే యతిరాజ్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, నెల్లూరు

ఆరోగ్యం.. ఆహ్లాదం



నా వయస్సు 72 సంవత్సరాలు. ఇంత ఆరోగ్యం ఉన్నానంటే నడకే ఇందుకు కారణం. 2015 సంవత్సరంలో లేబూరు నుంచి నెల్లూరు నగరానికి వచ్చాను. వ్యవసాయంతోపాటు వాకింగ్ చేస్తున్నా. నాకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. జీవితంలో వాకింగ్ ప్రధానం కావాలి. వాకింగ్ ఆహ్లాదాన్నిస్తుంది. అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం పాల్గొంటున్నా.

– రామకృష్ణారెడ్డి, రైతు

అవగాహనతో నడక



వాకింగ్ చేసేటప్పుడు అవగాహనతో ప్రతిరోజూ నడవాలి. వాకింగ్ వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కలుగుతుంది. కండరాలు, ఎముకలు దృఢపడతాయి. మధుమేహం, గుండెపోటు, పక్షవాతం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవు. శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. మానసిక ఆరోగ్యంలో భాగంగా ఒత్తిడి మాయమై ఆహ్లాదాన్నిచ్చే హార్మోన్స్ విడుదలవుతాయి. బ్రిస్క్ వాకింగ్(వేగంగా నడవడం) వల్ల 20 నుంచి 30 ఎంఎల్ రక్తపోటు తగ్గుతుంది. దీని వల్ల హఠాన్మరణాలు ఉండవు. వాకింగ్ చేసే వారిలో కణ విభజన ఎక్కువగా జరగడం వల్ల వీరు నిత్యయవ్వనంగా కనిపిస్తారు.

– డాక్టర్ కె.కనకాద్రి, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జీజీహెచ్, నెల్లూరు

'స్వామిత్వ'ను త్వరగా పూర్తి చేయండి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష (స్వామిత్వ) పథకం ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ బి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో 'స్వామిత్వ' పథకం ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 32 గ్రామాల్లో స్వామిత్వ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. పొరపాట్లు లేకుండా సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వే సమయంలో సమస్యలు వస్తే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. పొరపాట్లు జరిగి ఉంటే వాటిని సరి చేసి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కిషోర్, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు


తవ్వకాలు అడ్డుకుని నిరసన తెలుపుతున్న స్థానిక ఎస్సీలు

బిట్రగుంట: బోగోలు పంచాయతీ గంగతిప్ప సమీపంలోని వివాదాస్పద భూముల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. గంగతిప్ప సమీపంలోని 541, 542, 543,544, 546 తదితర సర్వేనంబర్లలోని భూములను సుమారు 30 ఏళ్ల క్రితమే స్థానిక ఎస్సీలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. నీటివనరులు లేకపోవడంతో స్థానిక ఎస్సీలు, పాడిరైతులు ఈ భూములను మేత పోరంబోకుగా వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో అధికారులు లబ్ధిదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, గతంలో మంజూరు చేసిన పట్టాలు రద్దు చేయకుండా గ్రావెల్ తవ్వకాల కోసం ప్రైవేట్ వ్యక్తులకు ఈ భూములు కేటాయించారు. దీంతో ఈ భూములపై వివాదం నెలకొంది. సుమారు పదేళ్ల నుంచి వివాదం జరుగుతుండగా మంగళవారం రాత్రి గ్రావెల్ తవ్వకాల కోసం పెద్ద పెద్ద యంత్రాలు, టిప్పర్లు తీసుకువచ్చి తవ్వకాలు ప్రారంభిస్తుండగా స్థానికులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్వాహకులు తవ్వకాలను నిలిపివేసి వెనుదిరిగారు.

కూలి పనులకు వచ్చి.. కొడుకును కోల్పోయి

- కాలువలో పడి నాలుగేళ్ల బాలుడి మృతి


దుర్గాకౌసిక్ మృతదేహం

పొదలకూరు: అభంశుభం తెలియని నాలుగేళ్ల బాలుడు కాలువ గట్టున ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. బాలుడి తల్లిదండ్రులు పొట్టకూటి కోసం ఎక్కడి నుంచో ఇక్కడ కూలి పనులకు వచ్చి బిడ్డను కోల్పోవడంతో గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. వివరాలు.. పొదలకూరుకు సమీపంలోని తోకంచి పునరావాసం వద్ద జామాయిల్ చెట్టు నరికేందుకు తూర్పు గోదావరి జిల్లా గంగవరం మండలం రాజారాం గ్రామం నుంచి కురసం రాంబాబు భార్య, తన నాలుగేళ్ల కొడుకుతో కలిసి వచ్చాడు. వారం రోజులుగా ఇక్కడే ఉండి పనులు చేసుకుంటున్నారు. బుధవారం రాంబాబు జామాయిల్ చెట్లు నరికే పనిలో ఉండగా అతని కుమారుడు దుర్గాకౌసిక్(4) సమీపంలో ఉన్న కండలేరు ఎడమగట్టు కాలువకు ఉపకాలువ గట్టున ఆడుకుంటూ ఏటవాలుగా ఉన్న కాలువలో పడిపోయాడు. రెండు అడుగుల లోతున కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో ఊపిరాడక మృతిచెందాడు. తల్లిదండ్రులు గుర్తించి పొదలకూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చినా ప్రయోజనం లేకపోయింది. సమాచారం తెలుసుకున్న సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరిముల్లా ఆస్పత్రికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారు.

అటవీప్రాంతంలో మంటలు



చేజర్ల: ఆదూరుపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఆకతాయిలు నిప్పు వేయడంతో మంటల చెలరేగి జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు.

కలువాయి తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యం

నెల్లూరు(అర్బన్): బాలాయపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న పసుపులేటి సుబ్రహ్మణ్యంను కలువాయి మండల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కలువాయి మండల తహసీల్దార్‌గా పనిచేసిన సోమ్లానాయక్‌ను బుచ్చి మండలానికి బదిలీ చేశారు.

రాష్ట్ర కమిటీలో కేపీ రెడ్డికి చోటు


విజయవాడలో ద్వారకాతిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసిన కేపీ రెడ్డి

నెల్లూరు(క్రైమ్): ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో అసోసియేషన్ ప్రస్తుత నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కేపీ రెడ్డికి చోటు దక్కింది. ఇటీవల తిరుపతిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర కమిటీలో జాయింట్ సెక్రటరీ/పబ్లిసిటీ సెక్రెటరీగా కేపీ రెడ్డిని నియమించారు. అసోసియేషన్ రాష్ట్ర నూతన కమిటీ ప్రతినిధులు బుధవారం విజయవాడలో ఏపీ పీటీడీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

కోర్టుల్లో మాతృభాష అమలు ఉత్తర్వులపై హర్షం


మాట్లాడుతున్న అన్నవరం సత్యనారాయణరావు

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లోని న్యాయస్థానాల్లో వారి మాతృభాషను అమలు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీ చేయడం చాలా సంతోషకరమని సీనియర్ న్యాయవాది గుమస్తా అన్నవరం సత్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు సీనియర్ న్యాయవాదులతో కలిసి ఆయన బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 1947వ సంవత్సరంలో జీఓ ఎంఎస్ 485 ప్రకారం న్యాయస్థానాల్లో మాతృభాష అమలు జరపాలని అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ఈ అంశంపై న్యాయవాదులు 2014 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చారని, అంతేకాకుండా 2017లో మాతృభాషలో న్యాయ మార్గదర్శిని నామకరణంతో మూడు పుస్తకాలు తెలుగులో రూపొందించి జిల్లా ప్రధాన న్యాయమూర్తులతో ఆవిష్కరించినట్లు తెలిపారు. న్యాయస్థానాల్లో మాతృభాష అమలుపై జనవరి 26న సుప్రీం కోర్టు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు ఉత్తర్వులు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసులు రెడ్డి, శ్రీరామమూర్తి, సామాజిక సేవకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెనుబల్లికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందుకొంటున్న చైర్మన్ బాబునాయుడు


కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబు నాయుడికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. రీసెర్చ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్, సిడ్బీ ఫౌండేషన్(న్యూఢిల్లీ) సంస్థలు సంయుక్తంగా ఆ కళాశాలలో 'మల్టీ డిసిప్లినరీ అప్లికేషన్స్'పై మంగళ, బుధవారాల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అనేక సాంకేతిక అంశాలపై సీనియర్ అధ్యాపకులు ప్రజెంటేషన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా పై రెండు నిర్వాహక సంస్థలు చైర్మన్ పెనుబల్లికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందజేశాయి. అలాగే కళాశాల డైరెక్టర్ పి.కృష్ణచైతన్యకు సోషల్ అవేర్‌నెస్ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, అడ్వైజర్ డాక్టర్ హర్షవర్ధన్, ఆ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య


నవీన్ మృతదేహం

వెంకటాచలం: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పూడిపర్తి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పూడిపర్తి గ్రామానికి చెందిన తలారి రామయ్య కుమారుడు నవీన్(25) వరికోత యంత్రం ఆపరేటర్‌గా వెళుతుండేవాడు. నిత్యం మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవ పడుతుండడంతో మంగళవారం నవీన్‌ను తండ్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ పంట పొలాల వద్ద పురుగు మందు తాగి ఇంటి వద్దకు వచ్చి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్సనిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు నవీన్‌ను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బుధవారం ఉదయం నవీన్ తండ్రి రామయ్య వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.30
పండ్లు	రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.104
లేయర్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.186
స్కిన్‌లెస్ చికెన్:	రూ.206
లేయర్ చికెన్:	రూ.128